క్లుప్తంగా

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి



మొక్కలు పంపిణీ చేసిన ఎంపీడీఓ యాదగిరి

సంగారెడ్డి టౌన్: మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని సంగారెడ్డి మండల ఎంపీడీఓ యాదగిరి అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మొక్కలను పెంచే బాధ్యత తీసుకోవాలని.. నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించిన కాలనీవాసులు

జహీరాబాద్ టౌన్: కాలనీలో నెలకొన్న సమస్యలు, అక్రమ నిర్మాణాలను ఆపాలంటూ పట్టణంలోని ఆదర్శనగర్, దత్తగిరి కాలనీవాసులు బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళనకు దిగారు. కాలనీల్లో రోడ్లు, మురుగు నీటి కాల్వలు నిర్మించాలని కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన కమిషనర్ అక్రమ నిర్మాణాలను వెంటనే ఆపాలని సిబ్బందిని ఆదేశించారు.

అంగన్‌వాడీలో పౌష్టికాహారం



ఎగ్ బిర్యాని వడ్డిస్తున్న సీడీపీఓ చంద్రకళ

మునిపల్లి(అందోల్): అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు సీడీపీఓ చంద్రకళ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చిన్నచల్మెడ, గోపులారం, అల్లాపూర్ అంగన్‌వాడీ సెంటర్లలో గర్భిణులకు , బాలింతలకు ఎగ్ బిర్యానీ వడ్డించారు. అంతకుముందు అంగన్‌వాడీ సెంటర్లలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ సేకరణ



ప్లాస్టిక్‌ను సేకరిస్తున్న సీనియర్ సిటిజన్లు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని మైహెయిర్ అపార్ట్‌మెంట్ సీనియర్ సిటిజన్ల ఆధ్వర్యంలో బుధవారం తెల్లాపూర్ పరిసర ప్రాంతాల్లోని రోడ్ల పక్కల ప్లాస్టిక్ సీసాలు, కవర్లను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడటం వల్ల పర్యావరణానికి నష్టం జరుగుతుందన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నా లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్‌లు సూర్యనారాయణ రాజు, డా.శ్రీనివాస్ రాజు, రామకృష్ణ, కృష్ణారావు, అంజయ్య, బోస్, విజయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పట్టణంలో పేరుకుపోతున్న చెత్త



మంజీరానగర్ కాలనీలో రోడ్డు పక్కన చెత్తకుప్ప

సంగారెడ్డి టౌన్: పట్టణంలో పారిశుద్ధ్యం పడకేసింది. పలు కాలనీల్లో ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. అధికారుల పర్యవేక్షణ లోపంతో చెత్త సేకరణ సరిగ్గా జరగడం లేదని.. చెత్త ఆటోలు రావడం లేదని ప్రజలు వాపోతున్నారు. పలుకాలనీల్లో రోడ్లపై ఇష్టమొచ్చినట్లు చెత్తను పారబోస్తున్నారని రోడ్లకు ఇరువైపులా చెత్తకుప్పలతో దర్శనమిస్తున్నాయన్నారు. అధికారులు చర్యలు తీసుకొని చెత్త కుప్పలను శుభ్రం చేయాలని వర్షాకాలం ఉండడంతో దోమలు, ఈగలు వ్యాపిస్తున్నాయని వెంటనే శుభ్రం చేయాలని పలు కాలనీవాసులు కోరుతున్నారు.

పత్తిపంటకు తీవ్ర నష్టం

మండలంలోని గాజుల్‌పాడులో భారీవర్షం ధాటికి పత్తి పంట తీవ్రంగా నష్టం వాటిల్లిందని రైతులు తెలిపారు. బుధవారం గ్రామ శివారులోని వాగు పరిసర ప్రాంతాల్లో దాదాపు 12 ఎకరాల పత్తి పంట నీట మునిగి, వేర్లు కుళ్లిపోయాయని పలువురు రైతులు వాపోయారు. సంబంధిత వ్యవసాయ, రెవెన్యూ అధికారులు పంటనష్టం అంచనాలు వేసి ప్రభుత్వం ద్వారా పరిహారం అందించాలని కోరారు.

– కంగ్టి(నారాయణఖేడ్):



కంగ్టి: గాజుల్‌పాడులో నీట మునిగిన పత్తిపంట

గుంతల రోడ్డు పరిశీలన

గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారం నుంచి పటాన్‌చెరు వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన మరమ్మతులు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆర్‌అండ్‌బీ ఏఈ, కమిషనర్ వెంకటరామయ్య మాజీ సర్పంచ్ సురేందర్‌గౌడ్‌తో కలిసి గుంతల రోడ్డును పరిశీలించారు. త్వరలో మరమ్మతు పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, గణేష్, వీరేష్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

– జిన్నారం(పటాన్‌చెరు):



ధ్వంసమైన రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

యూరియా కోసం రైతుల నిరీక్షణ

- వారం రోజులుగా తిరుగుతున్నా దొరకడం లేదు
- యూరియా కోసం రైతుల ఆందోళన
- నాయకులు, బడా రైతులు స్టాక్ చేసుకున్నట్లు ఆరోపణ

యూరియా కొరత రైతన్నకు చుక్కలు చూపిస్తుంది. సాగు పనులు మానుకొని ఎరువుల కోసం పడిగాపులు కాసినా యూరియా దొరకడం గగనం అవుతుందని రైతులు ఆందోళనకు వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయానికి సరిపడా యూరియాను సరఫరా చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



దౌల్తాబాద్ ఆగ్రో ఫెర్టిలైజర్ షాపు వద్ద యూరియా కోసం రైతుల పడిగాపులు

హత్నూర(సంగారెడ్డి): యూరియా కోసం వారం రోజులు తిరిగిన దొరకకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బుధవారం హత్నూర సొసైటీ కార్యాలయం, దౌల్తాబాద్ ఆగ్రో ఫెర్టిలైజర్ షాప్ వద్దకు యూరియా వచ్చిందని తెలియడంతో ఉదయాన్నే పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చారు. సొసైటీకి 280 బస్తాలు, ఆగ్రో షాపులకు 280 యూరియా బస్తాలు వచ్చాయి. ఆధార్ కార్డు ద్వారా ఒక రైతుకు రెండు బ్యాగుల చొప్పున అందించడంతో అరగంటలో అయిపోయింది. వారం రోజుల నుంచి తిరుగుతున్నా కనీసం ఒక్క బస్తా కూడా దొరకడం లేదని పలు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. హత్నూర మండలంలో వర్షాకాలంలో 25 వేల ఎకరాల వరిసాగు, నాలుగు వేల ఎకరాలలో పత్తి సాగు, 50 ఎకరాలలో కంది, 20 ఎకరాలలో మొక్కజొన్న, 50 ఎకరాలలో మిర్చి పంటలను మండలంలో సాగు చేస్తున్నారు. ఈ పంట సాగుకు సుమారు 2000 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంది. కానీ ఇప్పటివరకు అధికారులు మండలానికి సుమారు 1500 మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా చేశారు. వచ్చిన యూరియాలో నాయకులు, బడా రైతులు తమ పరపతిని ఉపయోగించుకొని యూరియా పెద్ద మొత్తంలో స్టాక్ చేసుకున్నట్లు పలు గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు. చిన్నసన్నకారు రైతులు వరినాట్లు వేసి సుమారు నెలరోజులవుతున్నా ఒక్క యూరియా బస్తా దొరకడం లేదని వ్యవసాయ అధికారులకు చెప్పిన ఎవరూ పట్టించుకోవడంలేదని వాపోయారు. యూరియాను సరఫరా చేయాలని పలు గ్రామాల రైతులు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

వారం నుంచి తిరుగుతున్నా



నాలుగు ఎకరాల వరి సాగు చేశా.. వారం రోజుల నుంచి యూరియా కోసం తిరుగుతున్నా ఇప్పటివరకు ఒక్క బస్తా కూడా అందలేదు. అధికారులు మాత్రం యూరియా వస్తుందని చెప్పన్నారు.. కానీ వచ్చిరాగానే అయిపోతుంది. పంటలకు యూరియా చేయకపోతే ఎలా ఎదుగుతుంది.

– గణేష్ , సికిందలాపూర్ రైతు

సారు యూరియా ఇప్పించండి



వరినాట్లు వేసి 15 రోజులైంది యూరియా ఇప్పించండి సారూ అంటూ వారం రోజులుగా తిరుగుతున్నా.. ఇప్పటికీ ఒక బస్తా కూడా ఇవ్వలేదు. ఉన్నతాధికారులు దయదలచి యూరియా ఇప్పించాలని వేడుకుంటున్నాం.

– కొమురయ్య చీక్ మద్దూర్ రైతు

ఆధార్ కార్డుకు రెండు బస్తాలు

ప్రభుత్వం మండలానికి సరఫరా చేసిన యూరియాను ఆధార్ కార్డుకు ప్రతి రైతుకు రెండు బస్తాలు ఇస్తున్నాం. ఇప్పటివరకు 1500 మెట్రిక్ టన్నుల యూరియాను మండలంలోని రైతులకు సరఫరా చేశాం. అధికారులు యూరియా పంపిస్తే రైతులందరికీ అందిస్తాం.

– శ్రీనివాసరావు, మండల వ్యవసాయశాఖ అధికారి

22 నుంచి ఉపాధి పనులు

- 2,451 పనులకు రూ.19.59 కోట్లు మంజూరు
- పలు అభివృద్ధి పనులకు రేపు శంకుస్థాపన

సంగారెడ్డి జోన్: జిల్లాలో ఈనెల 22 నుంచి ఉపాధి పనుల జాతర మొదలు కానుంది. జిల్లాలో 10 విభాగాల్లో 2,451 పనులు చేపట్టేందుకు రూ.19.59 కోట్లు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించేందుకు గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

22న అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో నూతన గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవన నిర్మాణాలు, స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా నిర్మించే ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సెగ్రిగేషన్ షెడ్ నిర్మాణాలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా గ్రామీణ రహదారుల నిర్మాణం వంటి పనులు చేపట్టనున్నారు. అదేవిధంగా ఇందిరా మహిళా శక్తి ఉపాధి పథకంలో భాగంగా పశువుల కొట్టాలు, కోళ్ల, గొర్రెల షెడ్లు, కొత్త వ్యవసాయ బావులు, వానపాముల ఎరువుల తయారీ, పండ్ల తోటల పెంపకానికి నిధు లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

> **అభివృద్ధి పనులకు ప్రాధాన్యం**
>
> 
>
> ఉపాధి హామీ పథకంలో గ్రామాల అభివృద్ధికి సంబంధించిన పనులకు ప్రాధాన్యం కల్పిస్తారు. 10 విభాగాలలో పనులు చేపట్టనున్నారు. ప్రతీ గ్రామంలో ఒక యూనిట్‌ను స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ప్రారంభిస్తారు.
>
> – జ్యోతి, డీఆర్‌డీఏ, సంగారెడ్డి

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి

జహీరాబాద్ టౌన్: ప్రభుత్వ భూమి అక్రమణకు గురి కాకుండా పరిరక్షించాలని బీజేపీ నాయకులు అధికారులను కోరారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు పూల సంతోష్ ఆధ్వర్యంలో నాయకులు మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావు, తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయం అధికారులకు బుధవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పూల సంతోష్ మాట్లాడుతూ.. పట్టణంలోని లాలాసాహెబ్ మొహల్లాలో పాత తహసీల్దార్ కార్యాలయం భవనం ఉండగా పూర్తిగా శిథిలమైందన్నారు. 8 వేల చదరపు అడుగుల ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి కొంత మంది రెండు రోజుల నుంచి ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఈ స్థలం తమదంటూ ముళ్లపొదలను తొలగించే పనులు చేపడుతున్నారు. కోట్ల విలువ గల ప్రభుత్వ భూమిని అక్రమార్కులు అక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. వెంటనే స్పందించి విలువైన ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని ఆయన అధికారులను కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బీజేపీ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సుధీర్‌బండారీ, సంతోష్, శ్రీధర్,అనిల్, సురేష తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న సంతోష్ తదితరులు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నియోజకవర్గ పరిధిలోని నీటిపారుదల శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం నీటిపారుదల శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ పరిధిలో మొత్తం 390 చెరువులు ఉండగా.. 80 చెరువులు అలుగులు పారుతున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని వర్షాలు కురియనున్న నేపథ్యంలో చెరువు కట్టల పటిష్టతను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని సూచించారు. రెవెన్యూ.. పంచాయతీ రాజ్, మున్సిపల్, పోలీస్‌శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని చెప్పారు. సమావేశంలో నీటిపారుదల శాఖ ఈఈ భీమ్, డీఈ రామస్వామి, ఏఈలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పొగాకు రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

జహీరాబాద్ టౌన్: జిల్లాను పొగాకు రహితంగా తీర్చిదిద్దాలని టుబాకో నియంత్రణ జిల్లా అధికారి విష్ణువర్ధన్ ఆకాంక్షించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం పొగాకు ఉత్పత్తుల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం నిషేధమన్నారు. 18 ఏళ్ల లోపు పిల్లలకు పొగాకు ఉత్పత్తులను విక్రయించరాదని చెప్పారు. అనంతరం పట్టణంలోని పలు విద్యాసంస్థల్లో కూడా ఆయన అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

సదాశివపేట(సంగారెడ్డి): సీఎం సహాయనిధి పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. అనారోగ్యంతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన 25 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ 5,79, 000ల చెక్కులను ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేలాది మంది పేద, మధ్యతరగతి ప్రజలకు సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూతను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. నిరుపేదలు ఈ పథకాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు, మండల యువత అధ్యక్షుడు నరేష్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ మండల నాయకులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

చెక్కుల పంపిణీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు సీఎం సహాయనిధి ఆపద సమయంలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నిరుపేదల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు.

ఉత్సవాలకు ఆలయం ముస్తాబు

- 27 నుంచి సెప్టెంబర్ 6 వరకు ఉత్సవాలు
- భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

పటాన్‌చెరు టౌన్: మండలంలోని రుద్రారం గణేశ్ గడ్డ సిద్ధి గణపతి ఆలయం నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబు అవుతుంది. గణేష్ గడ్డ ఆలయంలో కోరిన కోరికలు తీరుతాయని భక్తుల అపార నమ్మకం. ఆలయంలో 108 ప్రదక్షిణలు 11 వారాలు వ్రతం చేయాల్సి ఉంటుంది. మంగళ, ఆదివారాలు ప్రత్యేక అభిషేకాలు అర్చనలు చేస్తారు. కాగా, ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలతో పాటు రోజుకు ఒక విశేషా అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. మొదటి రోజు 27న ఉ .6 గంటలకు పంచామృత అభిషేకం , మహాగణపతి పూజ, మహాగణపతి హోమం, ప్రదోష పూజ, గణపతి వ్రతకల్పం, పల్లకీ సేవ తో ప్రారంభమవుతుందని, సెప్టెంబర్ 6న జాతర ముగిస్తుందని చెప్పారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆలయ ఈఓ లావణ్య తెలిపారు. అలాగే, డీఎస్పీ ప్రభాకర్ మాట్లాడుతూ.. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

వయోజనులకు చదువు నేర్పాలి

కల్హేర్(నారాయణఖేడ్): వయోజనులకు చదువు నేర్పాలని సిర్గాపూర్ ఎంఈఓ నాగరం శ్రీనివాస్ సూచించారు. బుధవారం సిర్గాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో నవభారత్ సాక్షరతా కార్యక్రమం 'ఉల్లాస్'పై శిక్షణ నిర్వహించారు. చదువు రాని వయోజనుల కోసం ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమం నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎపీఎం సరిత, ఆర్పీలు శ్రీకాంత్‌రెడ్డి, గోపాల్, సీఆర్‌పీలు శివకుమార్, ప్రకాశ్ పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాతకు నివాళి

దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. భారతదేశంలో కంప్యూటర్ విప్లవానికి బీజం పోసింది రాజీవ్ గాంధీ అని అన్నారు. ప్రపంచ దేశాలతో పోటీపడుతూ కంప్యూటర్ యుగానికి పెద్దపీట చేశారు. అనేక సంస్కరణలు తీసుకొని వచ్చి సాంకేతిక విప్లవాన్ని అభివృద్ధి దిశగా నడిపించారని కొనియాడారు.



నారాయణఖేడ్: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, నేతలు



జహీరాబాద్: మొగుడంపల్లి మండలం మిర్జంపల్లి తండాలో..



రామచంద్రాపురం(పటాన్‌చెరు): నివాళులర్పిస్తున్న కాటా శ్రీనివాస్ గౌడ్ తదితరులు



ఝరాసంగంలో నివాళులర్పిస్తున్న నాయకులు



పటాన్‌చెరుటౌన్: రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నీలం మధు, నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ తెగుళ్ల నివారణపై దృష్టి సారించాలి

రాయికోడ్(అందోల్): పంటల్లో తెగుళ్ల నివారణపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి సారిక సూచించారు. మండలంలోని ఖాంజమాల్‌పూర్, మాటూర్ గ్రామాల్లో అధిక వర్షాల కారణంగా దెబ్బతిన్న పత్తి, పెసర, మినుము, మిరప, చెరుకు, కూరగాయల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎరువులను పిచికారీ రూపంలో పంటలకు అందించాలన్నారు. నేలలో తేమశాతం అధికంగా ఉన్న నేపథ్యంలో ఎరువులు చల్లినా పెద్దగా ప్రయోజనం ఉండదన్నారు. ఆయా పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపి ఎకరాకు 19–19–19 కిలో ఎరువును నీటితో కలిపి మొక్కలకు పిచికారీ చేయాలన్నారు. అలాగే, నానో యూరియా అర లీటరును ఎకరాకు పిచికారీ చేయాలని చెప్పారు.

◆ సమన్వయంతో విజయవంతం చేయాలి

జహీరాబాద్ టౌన్: వినాయక చవితి ఉత్సవాలను అన్నిశాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని డీఎస్పీ సైదానాయక్ కోరారు. స్థానిక డీఎస్పీ కార్యాలయం అవరణలో బుధవారం ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు కార్యక్రమాలన్నీ ప్రశాంత వాతవరణంలో జరగాలన్నారు.

◆ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

జోగిపేట(అందోల్): అందోల్- జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో 100 రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం జోగిపేటలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. కార్యాలయంలోని ఖాళీ స్థలంలో ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సాగర్‌రెడ్డి, సబ్ ఇన్స్‌పెక్టర్ ఇఫ్తాకార్ అలీలు మొక్కలు నాటారు. హోమ్ సీడ్ ప్లాంటేషన్‌లో భాగంగా పట్టణంలోని అన్ని వార్డుల్లో మొక్కల పంపిణీ చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీందర్ తెలిపారు.

◆ ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు

నారాయణఖేడ్: ఎరువులను నిర్ణీత ధరకన్నా అధిక ధరలకు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని ఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం ఖేడ్‌లోని పలు ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల స్టాకు, రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ఎరువులు, పురుగుల మందుల వాడకాన్ని వాయిదా వేసుకోవాలన్నారు.

◆ రోడ్లు, మురికి కాల్వలు నిర్మించాలి

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని అల్లీపూర్ క్రిస్టియన్ కాలనీలోని రోడ్లు దెబ్బతిని అధ్వానంగా తయారయ్యాయి. వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నాయకులు మున్సిపల్ అధికారులను కోరారు. బస్తీబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం క్రిస్టియన్ కాలనీలో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డివిజన్ నాయకుడు మహిపాల్ మాట్లాడుతూ మురికి కాలువలు, సీసీ రోడ్లు తదతర సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్నారని వాపోయారు. మున్సిపల్ అధికారులు కాలనీలు సందర్శించి పరిష్కరించాలని కోరారు.

◆ ఉపాధ్యాయుడికి పీహెచ్‌డీ

పటాన్‌చెరు: మున్సిపాలిటీ పరిధిలోని ఇస్నాపూర్ మైనారిటీ పాఠశాలలో గణితం టీచర్ డాక్టర్ షేక్ సుభాన్ చేసిన పరిశోధనకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ 84వ వార్షిక స్నాతకోత్సవం హైదరాబాద్ జరిగింది. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ , ఉస్మానియా యూనివర్సిటీ ఛాన్సెలర్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఇస్రో చైర్మన్ డాక్టర్ నారాయణన్ హాజరై, విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు.

◆ నేడు డయల్ యువర్ డీఎం

నారాయణఖేడ్: ఖేడ్ ఆర్టీసీ డిపోలో గురువారం ఉ. 10.30 నుంచి 11.30 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం మల్లేశయ్య తెలిపారు. ప్రజలు 9959223170 నంబర్‌కు ఫోన్ చేసి ఆర్టీసీకి సంబంధించిన సమస్యలు, అవసరాలు, మెరుగైన సేవల కోసం సూచనలు, సలహాలను అందించవచ్చన్నారు.